క్లుప్తంగా

పక్కాగా ఈ-క్రాప్ నమోదు



మాట్లాడుతున్న తహసీల్దార్ రాము, ఏఓ స్వాతి

గుంతకల్లు రూరల్: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతన్నలు సాగు చేసిన పంటల నమోదును సమర్థవంతంగా నిర్వహించాలని తహసీల్దార్ రాము, మండల అగ్రికల్చర్ ఆఫీసర్ స్వాతి సిబ్బందికి సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పంట నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే పంట నష్ట పరిహారం , ఇన్సూరెన్స్ అందుతాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రతి రైతు పంట నమోదు చేసుకునేలా అవగాహన కల్పించి పంట నమోదు చేయాలన్నారు. ఈ-క్రాప్ నమోదులో ఎటువంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్బీకే సిబ్బంది, ఎంపీఈఓలు, వీఆర్వోలు పాల్గొన్నారు.

మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తిస్తే ఉపేక్షించం



శనగలగూడూరు గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటశివారెడ్డి

పుట్లూరు: మండలంలోని శనగలగూడూరులో సోమవారం డీఎస్పీ వెంకటశివారెడ్డి పర్యటించారు. మొహర్రం వేడుకల సందర్భంగా గ్రామంలో ఇరువర్గాల మధ్య జరిగిన వాగ్వాదంపై ఆరా తీశారు. గొడవలకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎలాంటి సమస్యలు ఉన్నా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. చట్టవ్యతిరేకంగా వ్యవహరించరాదన్నారు. అనంతరం ఇరువర్గాలతో మాట్లాడి వివరాలు సేకరించారు. మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఘర్షణలకు దిగడం, దాడులకు పాల్పడటం చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఒకసారి కేసులు నమోదు చేస్తే భవిష్యత్తు నాశనం అవుతుందని యువకులను హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ వేణుగోపాల్, యల్లనూరు ఎస్‌ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా అశ్విని



గుంతకల్లు రూరల్: గుంతకల్లు మండలం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా అశ్విని సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కడప జిల్లా విజిలెన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఈమె గుంతకల్లు మండలానికి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా బదిలీ అయ్యారు. ఎంపీడీఓ వెంకటరమణప్ప సమక్షంలో బాధ్యతలు చేపట్టారు.


జగనన్న కాలనీల్లో సౌకర్యాలు కల్పించాలి



మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ శ్రీమన్నారాయణ

యల్లనూరు: మండల వ్యాప్తంగా జగనన్న కాలనీలు, పీఎంఏవై-జీ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ డీఈ శ్రీమన్నారాయణ సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగనన్న కాలనీల్లో నీటి సరఫరా, విద్యుత్ కనెక్షన్లు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాల కల్పనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ సుప్రజ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ పోటీల్లో బీకేఎస్ విద్యార్థుల సత్తా



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో పాఠశాల సిబ్బంది, స్పెయిన్ క్రీడాకారులు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు బాస్కెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమంగళి, పీడీ గోపాల్‌రెడ్డి తెలిపారు. స్పెయిన్‌కు చెందిన జావుమా నేతృత్వంలో ఆర్డీటీ సంయుక్తంగా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సహకారంతో ఈనెల 30వ తేదీన అనంతపురంలోని ఇండోర్ స్టేడియంలో మిక్స్ జెండర్, అండర్-16 బాల బాలికల బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ జరిగినట్లు పేర్కొన్నారు. బీకేఎస్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచి తృతీయ స్థానంలో నిలిచినట్లు చెప్పారు. సత్తా చాటిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

జగనన్నతోనే జనరంజక పాలన

- సమస్యల పరిష్కారమే 'గడప గడపకూ మన ప్రభుత్వం' లక్ష్యం
- సీఎం జగన్‌ను మరోసారి ఆశీర్వదించండి
- ఎమ్మెల్యే వైవీఆర్



సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి

పామిడి: ముఖ్యమంత్రి జగనన్నతోనే జనరంజక పాలన సాధ్యమని ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక 20 వార్డుకు సంబంధించి ఆ వార్డు ఇన్‌చార్జ్ రామ్‌నాథ్‌రెడ్డి సారథ్యంలో ఎద్దులపల్లిరోడ్డులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గుంతకల్లు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డితో కలసి ఎమ్మెల్యే స్థానిక మహదేవయ్య కొట్టాల కాలనీ, ఎద్దులపల్లి ప్రైవేట్ వీధి, ఎద్దులపల్లిరోడ్డు వీధిలో పర్యటించారు. ఆయా వీధుల్లో ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరించారు. డ్రైనేజీ పూడికతీత, సీసీరోడ్లు, కరెంటు సమస్యలపై కాలనీవాసులు దేవి, బాలమ్మ తదితరులు ఎమ్మెల్యే వైవీఆర్ దృష్టికి తెచ్చారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలంటూ ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్, ఈఓ చంద్రశేఖర్, ఏఈ మధుసూదన్‌రావుకు సూచించారు.

స్వర్ణయుగాన్ని తలపిస్తోంది

ప్రజాసంకల్ప పాదయాత్రలో ఇచ్చిన హామీల్లో 98 శాతం హామీలను నెరవేర్చిన సీఎం జగన్ పాలన స్వర్ణయుగాన్ని తలపిస్తోందన్నారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ సర్కారు పాలన సాగిస్తోందన్నారు. మోసపూరిత వాగ్దానాలు ఇచ్చే టీడీపీ అధినేత బాబును, ఆయన దత్తపుత్రుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. సినీ డైలాగ్‌లతో మాటల గారడి చేస్తున్న పవన్‌కు ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గరపడ్డాయన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకెళ్తున్న వైఎస్ జగన్‌ను, నన్ను మరోసారి ఆశీర్వదించాలని కోరారు.

వైఎస్సార్ బీమా వర్తింపుపై సానుకూల స్పందన

వైఎస్సార్ బీమా సొమ్ము అందేలా చర్యలు తీసుకోవాలని మహదేవయ్య కొట్టాల కాలనీకి చెందిన కరణం మణెమ్మ ఎమ్మెల్యేను కోరింది. తన భర్త రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు తెలిపింది. వితంతు పింఛన్ వర్తింపజేయాలంటూ అదే కాలనీకి చెందిన ప్రభావతి కోరింది. ప్రభుత్వ పరంగా అర్చకులకు వర్తింపజేసే గౌరవ వేతనం వర్తింపజేయాలంటూ పురోహితుడు మహదేవయ్య కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే.. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ సీబీ జానకిరామిరెడ్డి, పార్టీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎల్ మధుసూదన్‌రెడ్డి, గుత్తి మార్కెట్ యార్డు మాజీ చైర్మెన్లు పెమ్మక చెన్నకేశవరెడ్డి, గౌరప్ప, పట్టణ సచివాలయాల కన్వీనర్ బీ ఆసిఫ్, చుక్కలూరు రామకృష్ణారెడ్డి, బోయ రామచంద్ర, ఈశ్వర్‌రెడ్డి, జోజోడే కుమార్, పార్వతీశ్వర్‌రెడ్డి, అనుంపల్లి సూరి, ముస్లిం మైనార్టీ నాయకులు సీ అబ్దుల్‌రజాక్, రవూఫ్, సునీల్‌రెడ్డి, జీ రాజశేఖర్ రావు, జగనిరవి, వెంకటగుప్తా, టీటీ నాగభూషణ్‌రావు, నీలకంఠారెడ్డి, సింగరప్ప, లాలెప్ప, గోపాల్, శివ, చినరాయుడు, వినోద్, బీసీ సెల్ రూరల్ కన్వీనర్ ఓబులేసు, సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడు మూలి నాగేశ్వర్‌రెడ్డి, సర్పంచులు చంద్రశేఖర్‌రెడ్డి, నారాయణస్వామి, రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుల పంపిణీ



రేషన్‌కార్డులు అందజేస్తున్న కౌన్సిలర్ సుజాత

గుంతకల్లుటౌన్: అర్హులైన అందరికీ పారదర్శకంగా సంక్షేమ ఫలాలు అందాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వ సంకల్పమని 4వ వార్డు కౌన్సిలర్ జింకల సుజాత తెలిపారు. సోమవారం వార్డులో 19 కుటుంబాలకు మంజూరైన కొత్త రేషన్ కార్డులను వీఆర్‌ఓ చంద్రశేఖర్‌ల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తమ వార్డులో 19 కుటుంబాలకు వివిధ కారణాలతో రేషన్‌కార్డులు రద్దయినట్లు తెలిపారు. ఈ విషయాన్ని గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. స్పందించిన ఎమ్మెల్యే సాంకేతిక సమస్యలను తొలగించి రద్దయిన రేషన్‌కార్డులు తిరిగి అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారని వెల్లడించారు.

స్వీపర్‌కు తీవ్ర గాయాలు

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో కాంట్రాక్ట్ స్వీపర్‌గా పని చేసే రంగమ్మ సోమవారం కాలు జారి కిందపడంతో తీవ్రంగా గాయపడింది. ఈ ఘటనలో ఆమె చేయి విరిగింది. వైద్యులు వెంటనే వైద్యం చేశారు.

టెండర్లు ముగిసినా పనులు చేపట్టరా?

- అధికారుల తీరుపై కౌన్సిలర్ల అసహనం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని

గుంతకల్లుటౌన్: పట్టణంలోని వివిధ వార్డుల్లో అభివృద్ధి పనులు చేయించేందుకు టెండర్లను నిర్వహించి నెలలు గడుస్తున్నా ఆ పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్లతో పనులను చేయించడంలో అధికారులు విఫలమైనట్లు అధికార ,ప్రతిపక్ష కౌన్సిలర్లు మండిపడ్డారు. సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్. భవాని అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. కౌన్సిలర్లు నీలావతి, నాగరత్నమ్మ, విద్యారాణి, కృపాకర్, పవన్‌గౌడ్ మాట్లాడారు. తమ వార్డులకు మంజూరైన అభివృద్ధి, బడుల్లో నాడు-నేడు పనులను పూర్తి చేయించడంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఎంఈ ఈశ్వరయ్య సెలవులో ఉండటంతో కాంట్రాక్టర్లు చేసిన పనులకు బిల్లులు ఆన్‌లైన్‌లో నమోదు కాకపోవడంతోనే వారు కొత్త పనులు చేసేందుకు అయిష్టత చూపుతున్నారని కమిషనర్ మల్లికార్జున తెలిపారు. త్వరలోనే పనులు షురూ చేయిస్తానని హామీ ఇచ్చారు. కౌన్సిలర్ షరీఫ్ మాట్లాడుతూ.. దోనిముక్కల రోడ్డులో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు ఇళ్లను నిర్మించుకోవడానికి వెళ్తే ఆ స్థలాలు కబ్జాకు గురయ్యాయన్నారు. ముస్లింలకు మ్యారేజ్ సర్టిఫికెట్లు వేగంగా మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కౌన్సిలర్ కృపాకర్, కోఆప్షన్ సభ్యుడు ఫ్లయింగ్‌మాబు మాట్లాడుతూ.. వీధికుక్కలతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారన్నారు. కుక్కలకు వ్యాక్సినేషన్, వాటి పునరుత్పత్తిని నిరోధించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం, 15వ ఆర్థిక సంఘం నిధులతో పలు వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. కార్యక్రమంలో కమిషనర్ మల్లికార్జున, వైస్ చైర్‌పర్సన్లు నైరుతిరెడ్డి, మైమూన్, కౌన్సిల్, కో-ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

కౌన్సిల్‌మీట్‌ను అర్ధాంతరంగా ముగించడం సరికాదు..

అజెండాలోని అంశాలపై పూర్తిగా చర్చించకుండానే కౌన్సిల్ సమావేశాన్ని అర్ధాంతరంగా ముగించి ప్రతిపక్ష కౌన్సిలర్ల గొంతు నొక్కుతున్నారని టీడీపీ సభ్యులు కౌన్సిల్‌హాల్‌లో పోడియం వద్ద కూర్చొని నిరసన తెలిపారు. చైర్‌పర్సన్ భవాని బదులిస్తూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జీరోఅవర్ లేదన్నారు. ప్రజాసమస్యలు, అజెండాలోని అంశాలు చర్చకు రాకుండానే సమావేశాల్ని ముగించిన విషయాల్ని మరిచిపోవద్దన్నారు. పార్టీలకతీతంగా అన్ని వార్డుల్లో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు.

ప్రశాంతంగా కౌన్సిల్ సమావేశం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ వన్నూర్‌బీ

గుత్తి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్‌బీ ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ బిందె వరలక్ష్మి, కౌన్సిలర్లు బుసా రూపావతి, లక్ష్మీరాణి, కృపా సుజాత, వరదరాజులు, నజీర్, రాజేశ్వరి, పుష్పావతి, నరేష్, అరవింద బాబు తదితరులు వార్డుల్లో నెలకొన్న డ్రైనేజీ, తాగునీటి సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఇమామ్ హుస్సేన్, బిల్లు కలెక్టర్ చంద్ర పాల్గొన్నారు.

జగన్‌తోనే యువతకు బంగారు భవిష్యత్తు



పాదయాత్ర చేపట్టిన నాయకులను అభినందిస్తున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుంతకల్లుటౌన్: రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందాలన్నా.. యువత భవిష్యత్తుకు బంగారు బాటలు పడాలన్నా మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి తెలిపారు. యువత స్వర్ణ భవితే ధ్యేయంగా ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు షేక్ జిలానీ బాషా, గౌస్‌బాషా(నాయబ్), అజీజ్, బాబు తదితరులు ఈనెల 15వ తేదీన ప్రారంభించిన ప్రజాసంక్షేమ పాదయాత్ర సోమవారం గుంతకల్లుకు చేరుకుంది. ఈ సందర్భంగా మార్కాపురం నుంచి ఇచ్ఛాపురం వరకూ 4,200 కి.మీ మేర పాదయాత్ర చేపట్టిన నాయకులను ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, వైస్ చైర్‌పర్సన్లు నైరుతిరెడ్డి, మైమూన్, కౌన్సిలర్లు శాలువా, పూలమాలతో సన్మానించారు. ప్రజాసంక్షేమ పాదయాత్రను పార్టీ శ్రేణులు, ప్రజలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జనరంజక పాలన సాగిస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మహిళకు సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరిస్తున్న కేతిరెడ్డి సాయి ప్రతాప్ రెడ్డి

తాడిపత్రి: ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలన సాగిస్తున్నారని యువనాయకుడు కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం రూరల్ పరిధిలోని గన్నెవారిపల్లి సచివాలయం-3 పరిధిలోని గన్నెవారిపల్లి, గోపాల్‌రెడ్డి కాలనీల్లో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిప్రతాప్‌రెడ్డి ఇంటింటికీ తిరుగుతూ పథకాలను వివరించారు. ముఖ్యమంత్రి అమలు చేస్తున్న నవరత్నాల్లోని పథకాలను వివరించారు. గ్రామంలోని ఆయా కుటుంబాల వారికి సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. ఈ నాలుగు సంవత్సరాల్లో పేదల సంక్షేమం కోసం సీఎం జగన్ అహర్నిశలు శ్రమించారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ కుల, మత, వర్గ, పార్టీలంటూ చూడకుండా పథకాలను అందజేస్తున్నారని కొనియాడారు. ఇలాంటి ప్రభుత్వాన్ని మరో మారు గెలుపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. స్థానికంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ, ప్రజా సమస్యలకు పరిష్కారం చూపుతున్నారన్నారు. తాడిపత్రి అభివృద్ధికి నిత్యం కృషి చేస్తున్నారన్నారని తెలిపారు. అనంతరం ప్రజలు విన్నవించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి, ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ద్వారా పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రమణమ్మ, ఎంపీటీసీ రవికుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పల్లె నాగేశ్వర్‌రెడ్డి, నాయకులు ప్రదీప్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పథకాలతోనే పేదల అభ్యున్నతి



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న యువ నాయకుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

తాడిపత్రి అర్బన్: సంక్షేమ పథకాలతోనే పేదల అభ్యున్నతి సాధ్యమని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం వాటర్‌వర్క్ సచివాలయం పరిధిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ స్వయంగా వెళ్లి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ద్వారా ప్రతి కుటుంబానికి అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. పథకాల లబ్ధిని తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో నాయకుడు కేతిరెడ్డి సాయిప్రతాప్ పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకే పౌర సేవలు

- జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఆలూరు సాంబశివారెడ్డి



శింగనమలలో ఆర్బీకేను ప్రారంభించిన జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఆలూరు సాంబశివారెడ్డి

శింగనమల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాల ద్వారా ప్రజల ముంగిటకే పౌర సేవలు అందుతున్నాయని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి పేర్కొన్నారు. సోమవారం శింగనమల, ఆకులేడు, లోలూరులో నిర్మించిన ఆర్బీకే, గ్రామ సచివాలయాలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా మండల కేంద్రాలకు వెళ్లకుండానే సొంత గ్రామంలోనే దాదాపు 500 సేవలను పొందుతున్నారన్నారు. ఆర్బీకేల ద్వారా విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ సలహాలు, పంట నష్ట పరిహారాలు, ఇన్‌పుట్ సబ్సిడీలు అందుతున్నాయని తెలిపారు. గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం జగనన్న పాలనలో సాకారమైంది. నియోజకవర్గంలో రూ.37 కోట్లతో గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు సహా 121 భవనాలు నిర్మించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకవచ్చి రైతులకు అండగా ఉన్నారన్నారు. గత టీడీపీ పాలనలో పంటకు నష్టం వాటిల్లితే పరిహారం అందించలేక పోయారన్నారు. కానీ జగనన్న పాలనలో ఇన్‌పుట్ సబ్సిడీ , పంటల బీమా అందుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి, ఎంపీపీ యోగేశ్వరి, సర్పంచులు నాగమునెమ్మ, సుభాషిణి, భాగ్యలక్ష్మి, వెంకటరాముడు, ఎంపీటీసీలు కురుబ ఉమ, మోరార్జీ, ఏడీఏ వెంకటరాముడు, తహసీల్దార్ ఈశ్వరమ్మ, ఎంపీడీఓ నిర్మలాకుమారి, ఏఓ అన్వేష్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆకులేడు రామచంద్రారెడ్డి, గాండ్ల కార్పొరేషన్ డైరెక్టర్ నరసయ్య, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఎస్వీ నారాయణ, చెన్నకేశవులు, రామాంజినేయులు, నలపరెడ్డి, వేణుగోపాలు రెడ్డి పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవం

బుక్కరాయసముద్రం: మండల పరిధిలోని దండువారిపల్లి, కేకే అగ్రహారం గ్రామాల్లో నూతన నిర్మించిన ఆర్బీకేలు, సచివాలయం, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ తదితర భవనాలను మంగళవారం ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ విజయ భాస్కర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి హాజరవుతారన్నారు.

సంక్షిప్త సమాచారం

3న మిశ్రమ బియ్యం సేకరణకు వేలం

గుత్తి రూరల్: తొండపాడు బొలికొండ రంగనాథ స్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన బియ్యం సేకరణకు ఈనెల 3న వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ దేవదాసు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేలం పాట ఉదయం 11 గంటలకు ప్రారంభం అవుతుందని పాటలో పాల్గొనే వారు రూ.1000 డిపాజిట్ చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల్లోపు ఆలయంలో సంప్రదించాలని సూచించారు.

ఘర్షణలో ఒకరికి గాయాలు

గార్లదిన్నె: మండల పరిధిలోని పాత కల్లూరులో సోమవారం ఇరువర్గాల ఘర్షణలో ఒకరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. పాత కల్లూరులో దొడ్డి రస్తా విషయంలో సాంబశివుడు, బాలన్న, రాము, రాజుకుమార్ మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ ఘర్షణలో సాంబశివుడుపై బాలన్న, రాము, రాజుకుమార్ దాడి చేశారు. సాంబశివుడికి రక్తగాయాలు కావడంతో అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు బాలన్న, రాము, రాజుకుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సాగర్ తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ కేసుపై విచారణ

గార్లదిన్నె: మండల పరిధిలోని ముకుందాపురంలో సోమవారం డీఎస్పీ ఆంథోనప్ప ఎస్సీ, ఎస్టీ కేసుపై విచారణ చేపట్టారు. గత నెల 24న ముకుందాపురం గ్రామానికి చెందిన సూర్యచంద్రారెడ్డి అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన ఎస్సీ కులానికి చెందిన నాగలక్ష్మిని కులం పేరుతో దూషించడంతో బాధితురాలు ఫిర్యాదు చేసిందని ఎస్‌ఐ సాగర్ తెలిపారు. కేసు నమోదు చేయడంతో డీఎస్పీ ఆంథోనప్ప క్షేత్ర స్థాయిలో విచారణ చేశారన్నారు.

రేషన్ పంపిణీ పక్కాగా చేపట్టాలి

గుంతకల్లు రూరల్: ఇంటింటికీ రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని తహసీల్దార్ రాము రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లకు సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సీఎస్‌డీటీ సుబ్బలక్ష్మితో కలిసి రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. రేషన్ పంపిణీ చేసే ఎండీయూ వాహనంలో తప్పనిసరిగా స్టాక్ బోర్డును ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి రేషన్ కార్డుకు రెండు కిలోల రాగులు పంపిణీ చేయాలని సూచించారు.

యాడికి: మండలంలోని రేషన్ షాపు డీలర్లందరూ తమ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలకు మంగళవారం టేక్‌హోం కిట్లను చేర్చాలని తహసీల్దార్ అలెగ్జాండర్ తెలిపారు.

యువకుడికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని టి.కొత్తపల్లి గ్రామ శివారులో సోమవారం రాత్రి ద్విచక్రవాహనం అదుపు తప్పి మల్లికార్జున అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మల్లికార్జున తన పొలంలో వ్యవసాయ పనులకు వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తుండగా గ్రామ శివారులో బైక్ అదుపుతప్పడంతో కింద పడ్డాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన మల్లికార్జునను కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కందిపప్పు, చక్కెర సరఫరా చేయండి

పుట్లూరు: రేషన్‌షాపులకు కందిపప్పు, చక్కెర సరఫరా చేయకపోవడంపై మండలంలోని పలు గ్రామాల డీలర్లు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ షాపు డీలర్లతో సమావేశం నిర్వహించారు. రేషన్ సకాలంలో సరఫరా చేయాలని తహసీల్దార్ మోహన్‌కుమార్ సూచించారు. కందిపప్పు, చక్కెర సరఫరా చేయడం లేదని డీలర్లు తెలిపారు. పుట్లూరు మండలానికి స్టాక్ పాయింట్ నుంచి కందిపప్పు, చెక్కర పంపిణీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

పెరటి కోళ్ల పెంపకంపై కళాజాత

పెద్దవడుగూరు: మండలంలోని కాశేపల్లి, బుర్నాకుంట, దిమ్మగుడి, భీమునిపల్లి, ముప్పాలగుత్తి తదితర గ్రామాల్లో పెరటి కోళ్ల పెంపకంపై సోమవారం మహిళా రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా పెరటి కోళ్ల పెంపకం వలన కలిగే లాభాలను కళాకారులు వివరించారు. తక్కువ ఖర్చుతో అధిక లాభాలను పొందవచ్చని తెలిపారు.

వేరుశనగ పంటకు గడ్డి మందు పిచికారీ

శింగనమల: మండలంలోని చిన్నజలాలపురం గ్రామంలో బండి రామకృష్ణకు చెందిన వేరుశనగ పంటకు అదే గ్రామానికి చెందిన చంద్రశేఖర్ వారి అనుచరులు గడ్డి మందు పిచికారీ చేసి నష్టపరిచారు. సోమవారం బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాలక్రిష్ణయ్య తెలిపారు. గతంలో వీరికి పొలం రస్తా విషయంలో గొడవ జరిగినట్లు పేర్కొన్నారు.

క్రైస్తవులకు భద్రత కల్పించాలి



తాడిపత్రిలో నిరసన వ్యక్తం చేస్తున్న క్రైస్తవులు

తాడిపత్రి అర్బన్/పామిడి: మణిపూర్‌లో క్రైస్తవులకు భద్రత కల్పించాలని కోరుతూ సోమవారం తాడిపత్రి పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ నుంచి పోలీస్ స్టేషన్ సర్కిల్ వరకూ క్రైస్తవులు భారీ ర్యాలీ నిర్వహించారు. స్త్రీలను నగ్నంగా ఊరేగించి గ్యాంగ్ రేప్ చేసి చంపేయడం దుర్మార్గమని మండిపడ్డారు. దోషులను త్వరగా పట్టుకొని కఠినంగా శిక్షించాలని పామిడిలో సీఎస్‌ఐ చర్చ్ సభ్యులు డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ ఆర్వీ సునితబాయికి వినతిపత్రం సమర్పించారు.

నిబంధనలు అమలయ్యేలా చూడాలి

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ఓ ప్రైవేట్ బ్లడ్‌బ్యాంక్‌లో ప్రభుత్వ నిబంధనలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ అనుపమను భారత రాజ్యాంగ అవగాహన వేదిక నాయకులు కోరారు. సోమవారం వారు అనంతపురంలో ఏడీఎంహెచ్‌ఓను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.

మరుగుదొడ్లు వినియోగించు కోవాలి

పెద్దవడుగూరు: గ్రామీణ ప్రాంతాల్లో మరుగుదొడ్లను వినియోగించుకునేలా ప్రజలను చైతన్య పరచాలని ఎంపీడీఓ కుళ్లాయిస్వామికి ఎస్ఎస్‌జీ స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ 2023 కేంద్ర బృందం సభ్యుడు వెంకటేష్ సూచించారు. సోమవారం చిత్రచేడు, మొళకతాళ్ల గ్రామాల్లో వారు పర్యటించారు. ఆయా గ్రామాల్లో ప్రజలతో మాట్లాడారు. పారిశుద్ధ్యం నిర్వహణపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగేశ్వరశాస్త్రి, పంచాయతీ కార్యదర్శి షాకీర్ పాల్గొన్నారు.

ఆలయ గోపురంపై లైటనింగ్ కండక్టర్ ఏర్పాటు



గోపురంపై లైటనింగ్ కండక్టర్ అమర్చుతున్న దృశ్యం

తాడిపత్రి అర్బన్: పిడుగుపాటు, ప్రకృతి విపత్తులను ఎదుర్కొనేందుకు స్థానిక చింతల వెంకటరమణస్వామి ఆలయంపై పురావస్తు శాఖ అధికారులు లైటనింగ్ కండక్టర్‌ను ఏర్పాటు చేశారు. చారిత్రక ఆలయానికి చెందిన గాలిగోపురం కట్టడం దెబ్బతినకుండా పిడుగుపాటుకు గురికాకుండా ఈ కండక్టర్ అడ్డుకుంటుంది. సుమారు రూ.లక్ష వ్యయంతో సోమవారం పురావస్తు శాఖాధికారులు, ఆలయ చైర్మన్ బాణా నాగేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ గోపురంపై లైటనింగ్ కండక్టర్‌ను అమర్చారు. ఆలయ గాలిగోపురం సుమారు 200 అడుగుల ఎత్తు ఉండటంతో ఇతర ప్రాంతాల నుంచి తెప్పించిన భారీ క్రేన్ సాయంతో కూలీలు ఆలయ గాలి గోపురంపై ఈ లైటనింగ్ కండక్టర్‌ను అమర్చారు. ఆలయ గోపురంతో పాటు అంతర్గత నిర్మాణాలకు ప్రకృతి పరంగా, ఇతర ప్రమాదాల కారణంగా నష్టం వాటిల్లకుండా చర్యలు చేపట్టామని ఆలయ చైర్మన్ బాణా నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు.